క్లుప్తంగా

పైపులైన్ పరిశీలన


గోరుకల్లు వద్ద పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

పాణ్యం: పాణ్యం మండలం గోరుకల్లు జలాశయం నుంచి డోన్ నియోజకవర్గానికి మంచినీటి సరఫరాకు చేపడుతున్న పైపులైన్ పనులను మంగళవారం జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఏపీ ఐఐసీ బోర్డు డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పరిశీలించారు. గోరుకల్లు వద్ద జరుగుతున్న పంప్‌హౌస్‌ను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ దాదాపుగా రూ.300కోట్లతో 138గ్రామాలకు వాటర్ గ్రీడ్ ద్వారా ఈ పైపులైన్ పనులు చేస్తున్నారన్నారు. డోన్ నవ నిర్మాణ యాత్రలో భాగంగా ఈ కార్యక్రమాన్ని మంత్రి ఆదేశాల మేరకు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మండలి చెర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి

గూడూరు రూరల్: వర్షాలు అధికంగా కురుస్తుండటంతో ఆశా కార్యకర్తలు ప్రజారోగ్యంపై దృష్టి సారించి చికిత్సలను అందించాలని హెల్త్ సూపర్‌వైజర్ రాఘవయ్య సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి తల్లి పాల ప్రాముఖ్యతను వివరించాలని, పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించడం వలన కలిగే ప్రయోజనాలు, మిషన్ ఇంద్ర ధనుస్సు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశాలు శ్రీలక్ష్మి, పార్వతమ్మ, పద్మ, శేషమ్మ, గిరిజ, సరస్వతి, పద్మావతి పాల్గొన్నారు.

సుంకులమ్మ సన్నిధిలో సినీ నిర్మాత


రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఫలహారాన్ని అందిస్తున్న అర్చకులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామ దేవత సుంకులాపరమేశ్వరీదేవిని మంగళవారం సినీ నిర్మాత రాజ్‌కుమార్ సేతుపతి, అలనాటి ప్రముఖ నటి లత దర్శించుకున్నారు. ఆయానికి చేరుకున్న రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక శాంతి హోమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాన్ని నిర్వహించి పట్టు వస్త్రాలను బహుకరించి అలంకరించారు. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందించారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


వర్కూరు సమీపంలోని పత్తి పైరును పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: పంటలకు సోకే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వర్కూరు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో కలిసి గ్రామ పరిధిలోని పంట పొలాలను పరిశీలించారు. పత్తి మొక్కలు ఎర్రబారుతున్నందున బోరాన్, మెగ్నీషియం పిచికారీ చేసుకోవాలని, ఎర్రపురుగు కనబడితే వేపనూనె, ఫినాల్ఫాస్‌ను పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఉల్లి, కంది, ఆముదం వంటి పంటలు సాగు చేసిన రైతులు కూడా నిత్యం పొలాలను పరిశీలిస్తూ ఉండాలని, ఏవైనా తెగుళ్లు, పురుగులు కన్పిస్తే నివారణ చర్యలు చేపట్టాలని ఏఓ సూచించారు. అనంతరం కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి

గడివేముల: ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని నంద్యాల జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ అధికారి డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి సూచించారు. మంగళవారం గడివేములలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా గ్రామాల్లో ఓపీ నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం నుంచి మంచానికే పరిమితమైన రోగులను పరిశీలించి ఉచితంగా మందులను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, ఫార్మసిస్ట్ రాజ్ కుమార్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పంట నమోదుకు వేళాయె!


పంట నమోదు చేస్తున్న ఆర్బీకే సిబ్బంది

పాణ్యం: వ్యవసాయరంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. రైతుల సంక్షేమే లక్ష్యంగా వివిధ పథకాలను అమలు చేస్తుంది. పెట్టుబడి సాయంతోపాటు ఆర్బీకేల ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులు అందజేస్తున్న ప్రభుత్వం రైతుల ఏ విధంగా కూడా నష్టపోకూడదనే ఉద్దేశంలో ఈ క్రాప్ నమోదు అవకాశం కల్పించింది. వర్షాభావ పరిస్థితుల మూలంగా పంట నష్టం జరిగితే ఈ క్రాప్ ఆధారంగా బాధిత రైతులకు పంటనష్ట పరిహారం అందజేస్తుంది ప్రభుత్వం. పాణ్యం మండలంలో ఖరీఫ్ ప్రారంభమైనప్పటి నుంచి బోర్లు, ఆయకట్టు, బావుల తదితర నీటి వనరుల కింద సాగు చేసిన పంటను పకడ్బందీగా నమోదు చేసుకునేందుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలు పొందించారు. ఈ క్రాప్ నమోదు చేపడుతన్నారు అధికారుల. ఇప్పటికే సాగు పంటలను వారానికోసారి క్షేత్ర స్థాయిలో గణాంకాలను పంపుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడం, ఆయకట్టు నీరు ఆలస్యమవడంతో వ్యవసాయ జోరు ఆలస్యంగా మొదలైంది. దీంతో అధికంగా బోర్లు, బావుల కింద పంటలు ముమ్మరం చేశారు. ప్రతి ఆర్‌బికే పరిధిలో సాగ వుతున్న పంటల వివరాలను ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి వ్యవసాయ సిబ్బంది రిపోర్టు పంపుతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ-క్రాప్ బుకింగ్‌తో రైతులకు ఎంతో లాభాలు ఉన్నాయని అధికారుల చెబుతున్నారు. రైతులకు ఈ-క్రాప్ చేయించుకోవడం వలన ప్రభుత్వం అందే ప్రతి రాయితీ కూడా సకాలంలో అందిచడం జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత పంటబీమా, పంటనష్టం, బ్యాంక్‌ల రుణాలు అందుతాయి.

సాగైన పంటలు:
ఈ ఏడాది ఖరీఫ్‌లో అధికారుల లెక్కల ప్రకారం మండలంలో సాగైన పంటల వివరాలు ఇలా ఉన్నాయి. వరి-68 హెక్టార్లు, పత్తి-207, మొక్కజొన్న-184, కంది-56, గోరుచిక్కుడు-04, మినుము-20, పండ్లతోటలు-26, కూరగాయలు-02, పూలు-01 హెక్టారు చొప్పున సాగయ్యాయి. మొత్తం 1420ఎకరాల్లో రైతులు పంట సాగు చేసినట్లు అధికారులు చెప్పారు.

> **ఈ క్రాప్ నమోదు చేసుకోండి**
> రైతులు సాగు చేసిన పంటలను కచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి. రైతులకు ఎంతో ప్రయోజనం. ఈ క్రాప్ మూలంగానే రాయితీలు వర్తిస్తాయి. పంట నమోదు కార్యక్రమాన్ని సిబ్బంది పకడ్బందీగా చేపడుతున్నాం.ఈ-క్రాప్ బుకింగ్ వలన కలిగే ప్రయోజనాలపై ఆయా ఆర్బీకేలో ప్రచురించాం. అలాగే సమావేశాల ద్వారా రైతులకు తెలిజేశాం.
> – జయప్రకాష్‌రెడ్డి, ఏఓ, పాణ్యం

సుంకేసులకు 1,016 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 1,016 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని మంగళవారం డ్యాం జేఈ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ కెపాసిటీ 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.068 టీఎంసీ నీరు నిల్వ ఉందని ఎగువ నుంచి 1016 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా ఒక గేటును ఎత్తి దిగువకు 886 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని, అలాగే కేసీ కెనాల్‌కు 130 క్యూసెక్కులు వదులుతున్నామని ఆయన తెలిపారు.

పొలంబడితో మెలకువలు

గడివేముల: పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులు వ్యవసాయంలో మెలకువలు తెలుసుకుంటారని ఏఓ హేమసుందర రెడ్డి చెప్పారు. మండల పరిధిలోని దుర్వేసి గ్రామంలో మంగళవారం వరి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ గ్రామసభలు, పంట యాజమాన్యం పద్ధతులపై రైతులకు కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండ్ల మమత, ఎంపీఈఓ మాధవి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నాం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సమస్యలు పరిష్కరించడానికే ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి తానూ గడప గడపకు వస్తున్నానని, ప్రజలు సమస్యలను తమ దృష్టి కురావాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం యాపర్లపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాటసాని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఎవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు.ఉలిందకొండ నుంచి యాపర్లపాడు రోడ్డును వేయించాలని, సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. రోడ్డు సమస్య త్వరలోనే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరో మారు పట్టం కట్టాలని ప్రజలను ఎమ్మెల్యే కాటసాని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెరవాడ రైల్వే అండర్ బ్రిడ్జికి గ్రీన్ సిగ్నల్

- బ్రిడ్జిని పరిశీలించిన గుంతకల్లు ఏఈడీఎన్
- ఫలించిన ఎమ్మెల్యే కాటసాని కృషి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


నెరవాడ రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

పాణ్యం: ఎట్టకేలకు మండల పరిధిలోని నెరవాడ ప్రజలు ఏళ్లతరబడి ఎదుర్కొంటున్న రైల్వే బ్రిడ్జి అండర్ డ్రైనేజీ నిర్మాణకి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కృషి ఫలించింది. సమైస్య వివరాలు ఇలా ఉన్నాయి. నెరవాడ సమీపానున్న రైల్వే బ్రిడ్జి కింద వర్షపునీరు, డ్రైనేజీ మురుగునీరు నిత్యం ప్రవహిస్తుంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. గ్రామంలోకి 108, 104 తదితర అత్యతసర వాహనాలు రాలేని పరిస్థితి. ఈ బ్రిడ్జి కింద వాహనాలు బోల్తాపడిన సంఘటనలు కోకొల్లలు. ఈ సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్వయంగా వెళ్లి పరిశీంచారు కూడా. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టారు. జూన్ 20వ తేదీన సికింద్రాబాద్‌లోని రైల్వే జీఎం అరుణ్‌కు మార్‌జైన్‌ను ఎమ్మెల్యే కాటసాని స్వయంగా కలిసి సమస్యలను వివరించి లిఖితపూర్వకంగా వినిత పత్రాన్ని అందజేసిన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యే లేఖను జీఎం కిందస్థాయి అధికారులకు పంపించారు. ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే రైల్వే శాఖ అధికారులతో చర్చించారు. ఎట్టకేలకు రైల్వే శాఖకు అధికారికంగా ఆదేశాలు అందడంతో గుంతకల్లు ఏడీఈఎన్ సుధాకర్‌రెడ్డి, కొత్త లైన్ అసిస్టెంట్ ఏడీఈ ఎన్ గాంధీ నెరవాడ బ్రిడ్జిని పరిశీలించారు. అండర్ డ్రైనేజీ వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణంలో మార్పులు చేసి పనులు చేసుకోవాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని నెరవడ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులతోపాటు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగాల శారదమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాంభూపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి, శేషారెడ్డి, జ్యోతిస్వరూప్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాజీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే హాజరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: మండల పరిధిలోని పొన్నకల్ సమీపంలోని మదరసాలో మంగళవారం జరిగిన హాజీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల రిజర్వేషన్, అభివృద్ధి, సంక్షేమానికి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి చేశారన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలతో పాటు అన్ని మతాలు, వర్గాలకు సంక్షేమ పథకాలను అందించి సమానత్వం చూపుతోందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ అబేలు పాల్గొన్నారు.

రక్తహీనత అరికట్టేందుకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: బాలింతల్లో రక్తహీనతకు అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా వ్యాధినిరోధక అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి ప్రమీల దేవి అన్నారు. మంగళవారం ఉలిందకొండ, కల్లూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల్లో ఆశా డే, తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని తల్లిపాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో వైద్య సేవలు అందించడంలో ముఖ్య పాత్ర ఆశా కార్యకర్తలదేనన్నారు. ప్రసవానంతరం బాలింతలలో రక్తహీనత నివారించడానికి ప్రభుత్వం ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోస్(ఎఫ్‌సీఎమ్) ఇంజెక్షన్ తీసుకువచ్చిందన్నారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలోపే తల్లిపాలు పట్టించాలని, మొదటి ఆరు నెలల వయసు వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టించాలన్నారు. కార్యక్రమంలో పీసీ పీఎన్‌డీటీ జిల్లా కన్సల్టెంట్ సుమలత, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రతినిధి డాక్టర్ రవి కాంత్, ఉలిందకొండ, కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు మీనా, శైలస్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


పొన్నకల్‌లో భూ సర్వేపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

గూడూరు రూరల్: భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆర్డీఓ హరిప్రసాద్ సూచించారు. పొన్నకల్‌లో జరుగుతున్న రీ సర్వేపై మంగళవారం ఆయన సమీక్షించారు. భూముల రీ సర్వేతో రైతులకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి పరిష్కారం చూపేందుకు రీ సర్వేను చేపట్టిందన్నారు. రీ సర్వే పూర్తయిన వెంటనే రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించడంతో పాటు హద్దులను ఏర్పాటు చేస్తామన్నారు. రీ సర్వేపై ఏవైనా అభ్యంతరాలుంటే రైతులు సంబంధించిన ఆధారాలను రెవెన్యూ అధికారులకు సమర్పించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి
ఓటరు జాబితాను ఆయా రాజకీయ పార్టీల నాయకులు పరిశీలించుకుని ఏవేనా పొరపాట్లు ఉంటే బీఎల్ఓల దృష్టికి తీసుకువచ్చి సరిచేసుకోవాలని ఆర్‌డీఓ హరిప్రసాద్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించారు.

అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- ఎంపీపీ ఉసేన్‌బీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉసేన్‌బీ

పాణ్యం: అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు అంకితభావంతో సేవలు అందజేయాలని ఎంపీపీ ఉసేన్‌బీ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి మలేరియా, టైఫాయిడ్ తదితర అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని సూచించారు. ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలని, ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు ఏర్పడితే వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు అర్హులందరికీ అందజేయాలని, ఎక్కడ నిర్లక్ష్యం వహించరాదన్నారు. రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యతగా అందించాలన్నారు. అనంతరం ఆయా శాఖల వారీగా అధికారులు పురోగతిని చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్ ఎంపీడీఓ దస్తగిరి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల
ప్రభుత్వం అమలు చేస్తున్న దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. ప్రభుత్వం దూర విద్యకు సంబధించి విడుదల చేసిన షెడ్యూల్ పోస్టర్‌ను ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీపీ విడుదల చేశారు. పోస్టర్‌లను ప్రతి గ్రామంలో అతికించాలని, చదువుకు దూరంగా ఉండే వారికి ఇదోక సువర్ణ అవకాశమని ఈ సందర్భంగా ఎంపీపీ సూచించారు.

పకడ్బందీగా భూముల రీసర్వే

కర్నూలు(న్యూటౌన్) : కర్నూలు మండలంలో జరుగుతున్న భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్.శివరాముడు వీఆర్వోలను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కర్నూలు మండలం బి.తాండ్రపాడులో జరుగుతున్న భూముల రీసర్వే రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేతో రైతుల మధ్య నెలకొన్న భూ వివాదాలు పూర్తిగా పరిష్కారమవుతాయన్నారు. భూముల రీసర్వేకు రైతులందరూ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రీసర్వేపై ముందస్తుగా గ్రామాల్లో దండోరా వేయించి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ రాజేష్, బి.తాండ్రపాడు వీఆర్వోలు అనిల్, అరవింద్, సర్వే సహాయకులు పాల్గొన్నారు.

కోడుమూరు: భూముల రీసర్వేతో భూ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని తహసీల్దార్ జయన్న అన్నారు. మంగళవారం మండలంలోని వర్కూరు గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను ఆయన పరిశీలించి సచివాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి రైతు రీసర్వేలో తన భూముల వివరాలను పరిశీలించుకుని ఏవైనా తప్పులుంటే రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి సరి చేయించుకోవాలని సూచించారు.

పింఛన్లు సకాలంలో అందజేయాలి


అమడగుంట్లలో ఎంపీడీఓ సమక్షంలో వెంకటేశ్వర్లుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బజారి


పర్ల గ్రామంలో దివ్యాంగుడు సుంకన్నకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రామ గిడ్డమ్మ

కోడుమూరు రూరల్: పింఛన్లను సకాలంలో అందజేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. మంగళవారం అమడగుంట్ల, వెంకటగిరి గ్రామాల్లో సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం పింఛన్ల పంపిణీని పరిశీలించారు. మండలంలో 8,761 పింఛన్లుండగా మంగళవారం సాయంత్రానికి 5,262 మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన సొమ్ము అందజేశారని ఎంపీడీఓ తెలిపారు. అలాగే ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగు చేసిన పండ్ల తోటలను పరిశీలించారు. పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎంపీడీఓ వివరించారు.

కర్నూలు మండలంలో..
కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని వైఎస్సార్ పింఛన్ కానుకను వలంటీర్లు తెల్లవారు జామున లబ్ధిదారుల ఇంటి వద్దకే అందజేశారు. మండల పరిధిలోని 9,910 మంది పింఛన్‌దారులు ఉండగా 3,789 మందికి పింఛన్ డబ్బులను అందజేసి 38 శాతం పూర్తి చేశారు. టెక్నికల్ సమస్యలతో పింఛన్ పంపిణీ కాస్త నెమ్మదిగా జరిగిందని ఎంపీడీఓ అజాంఖాన్ వెల్లడించారు.

కల్లూరు: మండలంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి తలుపు తట్టి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 8,135 మంది పింఛన్‌దారులు ఉండగా సాయంత్రానికి 3,913 మందికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

గడివేముల: మండలంలో 5,583 మంది పెన్షనర్లు ఉండగా మొదటి రోజే 2,895 మందికి(52 శాతం) వలంటీర్లు పింఛన్ సొమ్ము అందజేసినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. రెండు, మూరు రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తామన్నారు.

పాణ్యం: మండలంలో 6,208 మంది పింఛన్‌దారులు ఉన్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. ఆలమూరుకు చెందిన బాల సుబ్బయ్య శాంతి రాం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ వెంకటేశ్వరమ్మ ఆస్పత్రికి వెళ్లి వేలిముద్రలు తీసుకుని పింఛన్ సొమ్ము అందించారు. కాగా పింఛన్ల పంపిణీ మొదటి రోజు 48.47 శాతమే పూర్తయిందని అధికారులు తెలిపారు.


నిడ్జూరులో బుద్దమ్మతో వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ మోహన్


కరిమద్దెలలో వృద్ధురాలు సంజీవమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాము


శాంతిరాం ఆసుపత్రిలో బాల సుబ్బయ్యకు వికాలంగుల పింఛన్ అందిస్తున్న ఆలమూరు వలంటీర్ వెంకటేశ్వరమ్మ

ప్లాస్టిక్ వాడితే జరిమానా


ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులకు కరపత్రాలు పంచుతున్న ఈఓ అజయ్‌భాస్కర్

కోడుమూరు రూరల్: ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధిస్తున్నామని, నిబంధనలు పాటించని వారికి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామని పంచాయతీ ఈఓ అజయ్ భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పంచాయతీ సిబ్బందితో కలిసి కూరగాయలు, కిరాణం, దుస్తుల దుకాణదారులకు కరపత్రాలను పంచి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని, అనేక జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని వివరించారు. ఈనెల 15 నుంచి పంచాయతీ పరిధిలో ఎవరైనా వ్యక్తులు, వ్యాపారలు ప్లాస్టిక్ వాడితే రూ.1000 నుంచి రూ.10000 వరకు జరిమానా విధిస్తామన్నారు. అలాగే చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా పంచాయతీ వాహనాల్లో మాత్రమే వేయాలని పట్టణవాసులకు ఈఓ సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్

కర్నూలు (న్యూటౌన్): వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల ప్రమాదం ఉందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎంపీడీఓ కేఏ అజాంఖాన్ సూచించారు. జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. నీటి నిల్వల మూలంగా కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించి చైతన్య పరచాలని కార్యదర్శులకు సూచించారు. ప్రస్తుతం కళ్ల కలక వ్యాధి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని సూచించారు. కళ్ల కలకలు మూడు రోజుల పాటు ఉంటుందని, ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ప్రతి శుక్రవారంఫ్రైడే డ్రైడే నిర్వహించి గ్రామాల్లో ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో ప్రజల నుంచి సమస్యలను పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిద్దె పైనుంచి పడి గౌండ మృతి

కర్నూలు: స్థానిక బుధవారపేటకు చెందిన షేక్షావలి (36) నిర్మాణ పనుల్లో ఉన్న ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి మృతిచెందాడు. ప్రకాష్ నగర్‌లో మూడో అంతస్తుపై మంగళవారం కూలీ పనిచేస్తుండగా అదుపు తప్పడంతో కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య షహనా ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.